


— సు. ధురిమ

"వెంటనే బయలుదేరు—శేషగిరి."

[illegible] టెలిగ్రామ్ కాగితం శర్మ చేతిలో రెపరెప లాడింది. శర్మకు చాలా సేపటిదాకా ఏమీ తోచలేదు. తను ఈ ముఖ్యమైన [illegible] ఉద్యోగానికే ముప్పు రావచ్చు. మళ్ళీ ఇలాటి ఉద్యోగం దొరక్కపోవచ్చు. అటేమో తన ప్రియమైన స్నేహితుడు అర్జెంటుగా బయలుదేరి రమ్మంటున్నాడు. స్వార్థానికి, స్నేహానికి మధ్య [illegible] పోరాటంలో స్నేహం నెగ్గింది. బొంబాయిలో ఉంటున్న శేషగిరి ఇంటికి వెళ్ళటం వాయిదా వేసేశాడు శర్మ. కాని, అతని మెదడులో అన్నీ శేషగిరిని గూర్చిన ఆలోచనలే. అసలు తన స్వంత అర్జెంటుగా రప్పించుకోవలసిన అవసరమేమొచ్చింది శేషగిరికి? ఒక వేళ శేషగిరికి ఏమైనా ఆక్సిడెంటయిందా? ఈ ఆలోచనవే భరించలేక శర్మ [illegible] శర్మ. 'గాడ్! అలాంటిదేం జరగకూడదు శేషగిరికి' అని మనస్సులోనే ప్రార్థించు

కున్నాడు. ఇన్స్పెక్షన్ జరిగిన ఆ రెండు వారాలను ముళ్ళమీద గడిపినట్లు గడిపి, అది కాస్త పూర్తవగానే వారం రోజులకి సెలవు పెట్టి బొంబాయికి పోయే ప్లేనులో ఎక్కాడు శర్మ. ప్లేన్ అను కున్న సమయంకన్నా కాస్త ఆలస్యంగానే బయలుదేరింది.


శేషగిరి, శర్మ ఇద్దరూ హైస్కూలు నుంచి ఎమ్. ఎ. దాకా కలిసి చదువు కొన్నారు. యూనివర్సిటీలో ఇద్దరి సబ్జెక్టూ ఒకటే. ఎప్పుడూ వారిద్దరూ కలిసే కనిపించేవారు. ఒకసారి శర్మకు వారం రోజులు జ్వరం వచ్చింది. శేషగిరి ఒక్కడే క్లాసులకి వెళ్ళేవాడు. అతణ్ణి చూసి, "జంట లేని ఒంటరి పక్షి! నిన్ను చూస్తే జాలేస్తూంది. గుండె చెరువవుతూంది" అని హాస్యం చేశారు కొందరు తుంటరి విద్యార్థులు. సెలవుల్లో ఇద్దరూ దేశమంతా తిరిగేవారు సరదాగా. డిగ్రీలు తీసుకున్న తరవాత విధి వారిని వేరు చేసింది. శర్మకి కలకత్తాలో, శేష గిరికి బొంబాయిలో ఉద్యోగాలయాయి. కాని, ఆరు నెల్లకోసారి శేషగిరి, శర్మ కలుసుకుంటూనే ఉండేవారు. నెలకు రెండేసి ఉత్తరాలు వ్రాసుకునే వారు. శేషగిరికి ఆరు నెల్ల క్రిందటే పెళ్ళయింది సుమిత్రతో. అప్పటినించీ స్నేహితుల మధ్య ఉత్తరాలు తగ్గిపోయాయి. అయినా, వారి స్నేహం మాత్రం చెడలేదు. ఒకరి మీద ఒకరికి అభిమానం తగ్గలేదు.

శాంతాక్రుజ్ ఏర్‌పోర్టులో దిగి టాక్సీలో శేషగిరి ఉంటున్న మల్టీ స్టోరీడ్ బిల్డింగ్ చేరుకున్నాడు. టాక్సీ వాడికి డబ్బు లిచ్చి లిఫ్ట్ ఎక్కి ఏడవ అంతస్తులోకి వెళ్ళాడు. శేషగిరి ఫ్లాట్ కేసి చూస్తే పెద్ద తాళంకప్ప కనిపిం చింది. ఒక్క క్షణం శర్మ కేమీ తోచ లేదు. 'అరే! ఎక్కడికి పోయినట్లు వీడు? వీడి భార్యకూడా ఇంట్లో ఉన్నట్టు లేదు' అనుకుంటూ అక్కడే నిలబడ్డాడు శర్మ. "ఎక్స్క్యూజ్ మీ!" అన్న సన్నటి కంఠస్వరం వినిపించి, స్వరం వినిపించిన దిక్కు కేసి తల తిప్పాడు. తెల్లటి, లావుపాటి ఓ సింధీ ఆడది కనిపించిం దతనికి. "ఎస్!" అన్నాడు శర్మ, ఆమె కేసి చూస్తూ. ఆవిడ ఇంగ్లీషులో, "నేను మిసెస్ సీతాను. మిస్టర్ శేషగిరిది మా పక్క ఫ్లాటే. మీ పేరు తెలుసుకో వచ్చా?" అంది, మర్యాద ఉట్టి పడు తున్న స్వరంతో. శర్మ తన పేరు, ఉద్యోగం చెప్పాడు. అది విని ఆవిడ లోపలికెళ్ళింది. తిరిగి వస్తున్న ఆమె చేతిలో ఓ కవరును గమనించాడు శర్మ. ఆమె అది శర్మ చేతి కిస్తూ, "ఇది మీ కివ్వమన్నారు మిస్టర్ శేషగిరి" అంది. ఆ కవరుని శర్మ అందుకొని, "శేషగిరి ఊళ్ళో లేడా?" అని ప్రశ్నించా డావిడను. మిసెస్ సీతా శర్మ వంక ఓ క్షణం తదేకంగా చూసి మెల్లిగా అంది: "ఐయామ్ వెరీ సారీ. హి ఈజ్ డెడ్. నో, హి కమిటెడ్ సూయిసైడ్." శర్మ శిలాప్రతిమే అయ్యాడు. ఆ కవరు అప్రయత్నంగా అతని చేతుల్లోంచి జారిపోయింది. "శేషగిరీ! చచ్చిపోయావా!" అంటూ రెండు చేతుల్లో మొహాన్ని కప్పుకున్నాడు. మిసెస్ సీతా కింద పడిన కవరును వంగి తీసుకుని శర్మను ఉద్దేశించి జాలిగా అంది: "టేక్ కరేజ్, మిస్టర్! ప్లీజ్ కమ్ ఇన్ టు మై హౌస్ అండ్ హావ్ సమ్ డ్రింక్." శర్మ తేరుకొని, "నో, థాంక్స్" అని చెప్పి ఆ కవ రందు కొని లిఫ్ట్‌లో కిందికి దిగాడు. మిసెస్ సీతా అతని వంక సానుభూతితో చూసింది. టాక్సీ తీసుకుని జుహూ బీచ్ కేసి పోనిమ్మన్నాడు శర్మ.

టాక్సీ దిగి బీచ్‌లో జనసంచారం ఎక్కువ లేని ఓ మూల కేసి నడిచాడు. ఓ సారి జేబుల్లో చేతులు దూర్చి సముద్రం వంక దీర్ఘంగా చూశాడు. సీతో నా కేమి లెక్కన్నట్లు అలలు ముందుకీ, వెనక్కీ పడుతున్నాయి. శర్మ కర్చీఫ్ పరుచుకుని కూర్చున్నాడు. జేబు లోంచి కవరును పైకి తీశాడు. కవరు చించాడు. లోపల ఉన్న తెల్ల కాగితాలను వణుకుతున్న చేతులతో బయటికి తీశాడు. నీళ్ళు నిండిన కంటికి అక్షరాలు కనిపించ లేదు. కళ్ళు తుడుచుకుని చదవడం మొదలెట్టాడు.

"డియర్ శర్మా, నువ్వు వస్తావని ఈ మూడు రోజులు ఎదురు చూశాను. నీతో అన్నీ చెప్పుకొని నా హృదయ భారం తీర్చుకుందా మనుకున్నాను. కానీ, ఇన్స్పెక్షన్ వలన నువ్వు రెండు వారాల దాకా రాలేనని వ్రాశావు. నా హృదయం లోని అగ్నిపర్వతాలను అంతదాకా నిద్ర పుచ్చలేను. నేనే నీ దగ్గరికి వద్దామను కున్నాను కానీ, నా మానసిక వ్యథ నన్ను శారీరకంగాకూడా దుర్బలుణ్ణి చేసివేసింది. నీ వద్దకు వచ్చే ఓపిక లేకపోయింది. నా సమస్యలకు పరిష్కారం ఆత్మహత్యే అనే నిర్ణయానికి వచ్చాను. పోయే ముందు నా ప్రాణస్నేహితుడవయిన నీకు అన్నీ వివరంగా తెలపాలనే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. ఈ విషయాలు తెలుసు కుని నువ్వేమనుకుంటావో నన్న సిగ్గుతో నే నెన్నో సార్లు నీకు తెలపాలనుకొనీ తెలపలేకపోయాను. ఈ ఉత్తరాన్ని పూర్తిగా చదివిన తరవాత నేను దోషిననే తీర్మానానికే నువ్వు వస్తావు — నాకు తెలుసు. నిజంగా నేను దోషినే.

శర్మా! నేను ఉద్యోగంలో చేరేటప్పటికి నాకు ఇరవైనాలుగేళ్ళు. నాకు వివాహమయింది ఆర్నెల్ల క్రితమే కదా? అంటే, నా ముప్ఫయ్యెనిమిదో ఏట. నేను ఉద్యోగంలో చేరినప్పుడే నాకు తెలుసు, నా వివాహం తొందరగా అవదని. ఎందుకంటే, నాకు పెళ్ళి కెదిగిన చెల్లెళ్ళు, చదువుకుంటున్న తమ్ముళ్ళు ఉండేవా రప్పుడు. ఒక్క నాన్నగారి సంపాదన చాలదు ఈ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చడానికి. నాకు వచ్చే వెయ్యిన్ని అయిదు వందల రూపాయల్లో నెలకు ఎనిమిది వందల రూపాయలు నాన్న గారికి పంపేవాణ్ణి. నా కప్పుడే పెళ్ళి చేస్తే ఇంతింత పెద్ద మొత్తాలను ఇంటికి పంపడానికి నా భార్య ఒప్పుకోదని నా తలిదండ్రుల భయం. సహజమైన భయమే కదా? నేనూ బాధ్యతలను పంచు కోవడం వలన నా చెల్లెళ్ళకు పెళ్ళి ళ్ళయింది. తమ్ముళ్ళు బాగా చదువుకొని ఉద్యోగాల్లో ప్రవేశించారు. అది నా కెంతో గర్వకారణంగా ఉంది. నన్ను ఇంత ఉన్నత స్థితిలోకి తెచ్చిన నా తండ్రికి ఆమాత్రం సాయం చేయడంలో తప్పే ముంది? ఐ హావ్ నో రిగ్రెట్స్ ఎబౌట్ ఇట్. సరే, ఆ విషయం వదిలేస్తాను. నేను పెళ్ళయితే చేసుకోలేదు గానీ, యౌవన సహజమైన కోర్కెలు నా లోనూ ఉండేవి. నేను ఉద్యోగంలో ప్రవేశించి ఏడాదికూడాదాటలేదనుకుంటా నప్పుడు. ఓ రోజు నా ఎన్‌ఫీల్డ్ మీద వస్తున్నా నింటికి సినిమా నుంచి. దారిలో వర్షం పట్టుకుంది. అప్పుడు చాలా అందమైన, నాజూకైన ఓ అమ్మాయి నన్ను ఆపి లిఫ్ట్ ఇవ్వమని కోరింది. నే నెక్కించుకున్నాను. ఒక బిల్డింగ్ ముందు ఆపమని, దిగిం దా అమ్మాయి. నన్నూ దిగి టీ తీసుకుని పొమ్మని అర్థించింది. తన పేరు సుచరిత అని చెప్పుకుంది. అంత అందమయిన అమ్మాయి అంత తియ్యగా ఆహ్వాని స్తూంటే కాదనలేకపోయాను. ఆ అమ్మాయి వెంట నడిచాను. మూడవ అంతస్తులో ఉన్న తన గదికి తీసుకెళ్ళింది. గదిలో డబుల్ కాట్, పెద్ద అద్దం, డ్రెస్సింగ్ టేబుల్. ఓ మూల టేబిల్ మీద ట్రాన్సిస్టర్. కిటికీలో రెండు ఫ్లవర్‌వేజ్‌లు. గోడలకి సీనరీలు. లోపల మరో గది, వంట గది లాటిది ఉంది. నన్ను మంచం మీద కూర్చోమని చెప్పి, తను లోపలికి వెళ్ళి రెండు కప్పుల్లో టీ తెచ్చి ఓ కప్పు నా చేతి కిచ్చి, మరో కప్పు తను తీసుకుంది. బయట హోరు మని వర్షం. లోపల చలిగా ఉంది. కిటికీ




ఆరతి చిత్రం—జి. సి. రెడ్డి (సుబ్బారావుపేట)

లోంచి చలిగాలి రివ్వున వీస్తోంది. వర్షం వలన తొందరగా చీకటి అలముకుంది. ట్రాన్సిస్టర్‌లోంచి ఓ హిందీ పాట వస్తోంది సన్నగా. నేను టకీ తాగలేదు. సుచరిత సౌందర్యాన్ని తాగాను. మొదటిసారిగా తప్పు చేశాను.

కానీ, అది తప్పనిపించలేదు నాకు అప్పట్లో. స్వర్గ సౌఖ్య మందుకొన్నా ననుకొన్నాను. తప్పనేది అంత తియ్యగా, మధురంగా ఉంటే మళ్ళీ మళ్ళీ ఆ తప్పే చేస్తాననుకొన్నాను ఆ మత్తులో. సుచరిత ఏ మాత్రం అడ్డు చెప్పలేదు. తరవాత నేను లేచి వెళ్ళబోయాను. వర్షం అప్పుడే కాస్త తగ్గుముఖం పట్టింది. సుచరిత చనువుగా నా భుజం మీద చేయి వేసి, 'ఫ్రీ అనుకుంటున్నారా

ఏమిటే కొంపదీసి? చూస్తే ఖరీదైన మనిషిలా ఉన్నారని ఎంతో ఆశ పడ్డాను' అంది నవ్వుతూ. నేను విస్తుపోయాను. 'ఆర్ యూ ఎ కాల్‌గాళ్?' అని అడిగాను ఆశ్చర్యంగా. 'ఎస్, మై డియర్ బోయ్!' అంటూ నా బుగ్గమీద చిటికె వేసింది. నేను యాంత్రికంగా నా జేబులోకి చెయ్యి పోనిచ్చి పర్సు తీశాను. లెక్క పెట్టకుండా కొన్ని నోట్లిచ్చాను. సుచరిత ఆత్రంగా నోట్లను లెక్క పెట్టుకొని, 'థాంక్యూ. అనుకొన్న దానికన్నా ఎక్కువే ఇచ్చారు. ఒకరిచ్చిన డబ్బుని తిరిగి ఇవ్వను గానీ, మరోసారి మీరిక్కడకు రావాలను కొంటే నిరభ్యంతరంగా రావచ్చు. అప్పుడు ఫీజ్ ఇవ్వక్కర్లేదు' అంది, విలాసంగా తల ఊగిస్తూ. 'సుచరిత. ఆహా! ఎంత మంచి పేరు ఎటువంటి మనిషికి?' అనుకుంటూ ఏమీ బదులు చెప్పకుండా కిందికి దిగాను. మోటార్ బైక్ స్టార్ట్ చేసి నా ఫ్లాట్ కేసి పోనిచ్చాను. ఎంత తెలివిగా కస్టమర్స్‌ని కుదుర్చుకొంటూందని దారిఅంతా ఆశ్చర్య పోయా న్నేను. ఆమెను మరిచిపోవాలను కున్నాను కానీ, ఆమె ఇచ్చిన సుఖం నాకు ఆమెను పదే పదే గుర్తుకు వచ్చేలా చేసింది. ఇది జరిగిన ఓ నెల తరవాత అనుకుంటాను నా కొలీగ్ ఒకతను పెళ్ళి చేసుకొని హనీమూన్‌కి కాశ్మీర్ వెళుతూంటే నేను వీడ్కోలిచ్చాను. ఇంటికి వచ్చిన నేను ఒంటరిగా ఫీలయ్యాను. ఏమేమో పిచ్చి ఊహలు, ఆలోచనలు— మోటార్ బైక్ తీసుకుని బయలు దేరాను. నాకు తెలియకుండానే సుచరిత ఇంటి ముందాగాను. లిఫ్ట్ ఎక్కి ఆమె గదికేసి వెళ్ళాను. సుచరిత నన్ను చూసి నవ్వుతూ, 'మీరు మళ్ళీ వస్తారని నాకు తెలుసు. నా దగ్గరికి ఒకసారి వచ్చినవా రెవరూ మళ్ళీ రాకుండా పోరు' అంది.

సుచరితది పంజాబ్ అట. బి. ఎస్‌సి పాసయింది. సినిమాల్లో చేరాలని బొంబాయి వచ్చింది. ఓ రెండు చిత్రాల్లో చిన్న వేషాలు దొరికాయికూడా. ఆ చిత్రాలు ఫ్లాప్ అయ్యాయి. ఉద్యోగ మేం దొరకలేదు. మరి జీవనాధారం లేక, ఇంటికి తన మొహం చూపించలేక ఈ వృత్తిని స్వీకరించింది. ఈ వృత్తిలో నెలకు రెండు వేల దాకా సంపాదిస్తోంది.

అప్పుడప్పుడూ సినిమాల్లో ఎక్స్‌ట్రా వేషాలు వేస్తోంది. నాకు సుచరిత నచ్చింది. అందం, చదువు, వాక్చాతుర్యం ఉన్న ఆడది ఆమె. నేను సుచరిత ఇంటికి తరుచు వెళ్ళేవాణ్ణి. మే మిద్దరం ఎన్నో పిక్చర్లకు, పిక్నిక్‌లకి సరదాగా వెళ్ళే వాళ్ళం. నాకూ హాయిగానే ఉండేది ఈ పని. భార్య అంటే లేని బరువూ, బాధ్యతా ఇలాటి గర్ల్ ఫ్రెండ్ ఉంటే చక్కగా బాధ్యతల్లేని సుఖాలని అనుభవించ వచ్చు. అతి త్వరలో సుచరిత నాకు మంచి స్నేహితురా లయింది. నా కష్ట సుఖాలను ఆమెతో చెప్పుకునేవాణ్ణి. ఆమె సానుభూతితో వినేది. మరి ఎందుకు సుచరితను పెళ్ళి చేసుకొని ఆమెను ఉద్ధరించి ఉండకూడదని నువ్వంటావేమో? సుచరితను నా భార్యగా భరించలేను. నా భార్య పవిత్రంగా ఉండాలి. డబుల్ స్టాండర్డ్స్ అని నవ్వుతావేమో? నవ్వు. ఫరవాలేదు. ఐ వోంట్ మైండ్. ఓ సారి నవ్వులాటగా సుచరితతో అన్నాను—'పెళ్ళి చేసుకోవా' అని. సుచి నా కేసి సూటిగా చూస్తూ, 'ఆర్ యు జోకింగ్, షష్? (నన్ను షష్ అని పిలిచేది.) అబ్బ! జీవితాంతం ఒక్కడి తోనే? ! మొహం మొత్తదూ?' అంది. అలాటి మనస్తత్వం ఉన్న స్త్రీని నే నెలా పెళ్ళాడగలను? అదీగాక త నెప్పుడూ నన్ను పెళ్ళి చేసుకోమని అడగలేదు. ఇలా పధ్నాలుగు సంవత్సరాలు గడిచాయి. నా బాధ్యతలు అన్నీ తీరాయి. అమ్మ, నాన్న నేను పెళ్ళి చేసుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పెళ్ళి ప్రయత్నాలు సాగించారు. ఫలితంగా సుమిత్ర అనే ముప్ఫయ్యేళ్ళ లెక్చరర్ తన ఉద్యోగానికి రిజైన్ ఇచ్చి, నా భార్యగా ఉద్యోగం చెయ్య డానికి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చింద్య



సుమిత్ర అందంగానే ఉంటుంది. నువ్వే పెళ్ళిలో చూశావు కదా? ఆలస్యంగా వివాహమయింది కదూ, నన్ను విపరీతంగా ప్రేమించింది. సుమిత్ర ప్రేమలో మునిగి పోయి సుచరితను దాదాపు మరిచి పోయాను. సుమిత్ర చాలా ఇన్నోసెంట్. చదువుకొందే కాని, అన్నీ పాతకాలపు భావాలు. తను సీతలా ఉంటుంది.

నేను శ్రీరామచంద్రుడిలా ఉండాలని తన కోరిక. ఓ రోజు మేము మెట్రోలో సినిమా చూసి వస్తున్నాం. నన్ను చూసి ఓ పాత పరిచయస్థుడు (నాకు పెళ్ళి అయిందని వాడికి తెలియదులే) సుమిత్ర వైపు చూసి నవ్వుడిగాడు అదోలా నవ్వుతూ—'మ్యా గర్ల్‌ఫ్రెండ్? వాట్ హాపెన్డ్ టు సుచరితా?' అని. ఈడ్చి చెంపమీద ఒకటిద్దా మనిపించింది నాకు. ఆ కోరికను నిగ్రహించుకొని, 'షి ఈజ్ మై మిసెస్—సుమిత్ర, ఎమ్. ఎ. అండ్ నౌ యూ గో టు హెల్' అని కోపంగా అనేసి ఎన్‌ఫీల్డ్ మీద సుమిత్ర నెక్కించు కొని ఇంటికి వచ్చేశాను. సుమిత్ర దారి మొత్తం మాట్లాడలేదు. ఇంటికి వచ్చాకకూడా మౌనమే. నేను భరించలేక "సుచరిత గురించి తెలుసుకోవాలని ఉందా?" అని కాస్త కోపంగానే అడిగాను. సుమిత్ర నా కళ్ళలోకి చూస్తూ అంది: 'నాకు నిజం కావాలి.' నేను ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాను. తరవాత ఏమయితే అదయిందని అంతా చెప్పేసి, 'ఇప్పుడు నాకు నువ్వే సర్వస్వం. ఆ చరిత్రహీను రాలికి నా హృదయంలో చోటు లేదు' అన్నాను మనఃస్ఫూర్తిగా. సుమిత్ర మాట్లాడలేదు. మా మధ్య మునుపటి ప్రేమాభిమానాలు తగ్గినట్టనిపించింది నా కా క్షణంలో. బట్ ఐ కాంట్ హెల్ప్ ఇట్. కొన్ని రోజుల తరవాత సుచరిత వద్ద నుంచి నా కో ఉత్తరం వచ్చింది. "డియర్ షష్! నువ్వు పెళ్ళి చేసుకొని నన్ను మరిచిపోగలిగావు కానీ, నేను నిన్ను మరిచిపోలేక పోతున్నాను. నాకు తెలియ కుండానే నిన్ను ప్రేమించా ననుకొంటాను. ఇంతకు ముం దెప్పుడూ ఇలా ఫీలవ లేదు. నా లాంటి దానికికూడా ప్రేమ లాంటిది ఉంటుందా అని ఎగతాళి చేస్తా వేమో? ఎంతయినా మనది పధ్నాలుగేళ్ళ బంధం గదూ? ఇప్పుడు నా వ్యాపారం కూడా పడిపోయింది, నానిరుత్సాహంవలన. వీలుంటే ఓ సారి మా ఇంటికి వచ్చి పో. నీ సుచి'. ఈ ఉత్తరం చూడగానే నా మనస్సు ఏదోలా అయిపోయింది. ఓ సారి వెళ్ళి చూసివస్తే ఏమయిందని అనుకొని సుచరిత ఇంటికి వెళ్ళాను ఆ సాయం కాలమే. సుచరిత నన్ను చూసి చాలా సంతోషపడిపోయింది. చిక్కిపోయింది మనిషి. చక్కనమ్మ చిక్కినా అందమే నన్నట్లు ఉంది. నిజంగా చెబుతున్నాను—ఆ రోజు సుచరితతో ఊరికే నాలుగు మాటలు మాట్లాడి వచ్చేశా నంతే. తెలిసీ సుమిత్రకు అన్యాయం చెయ్యదలుచుకో లేదు. ఇంటికి వచ్చిన తరవాత సుమిత్రతో అంతా చెప్పాను, మా మధ్య రహస్యా లేమీ ఉండకూడదన్న సదుద్దేశ్యంతో. సుమిత్ర అంతా విని సుచరిత ఎక్కడుం టుందని యాథాలాపంగా అడిగింది. నేను చెప్పాను. ఇది జరిగిన రెండు రోజులకు సుచరితను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. నా కెందుకో చాలా బాధ అనిపించింది. అందం, చదువూ, తెలివీ—అన్నీ ఉన్న మనిషి చివరికి ఎలాటి స్థితికి దిగజారిపోయింది! నేరుగా పోలీస్ స్టేషనుకు వెళ్ళాను. ప్రయత్నం మీద సుచరితను కలుసుకోవడానికి వీలయింది. సుచరిత నన్ను చూసి కన్నీళ్ళ మధ్య నవ్వింది. 'నే నంటే అసహ్యంగా ఉంది కదూ?' అంది. నేను మౌనంగా నిల బడ్డాను. బెయిల్ మీద తనని విడుదల చేసే ఏర్పాట్లు చేస్తానని చెప్పాను. సుచరిత థాంక్స్ చెప్పి, 'ఇంతకూ నే నిక్క డుండటానికి కారకు లెవరో తెలుసా? నీ భార్య. నే నంటే తనకు అసూయ కాబోలు' అంటూ నా మొహంలోని మార్పులు గమనించింది దీక్షగా. నేను నివ్వెరపోయాను. సుమిత్ర కింత ధైర్యమా! పైకి అమాయకంగా కని పిస్తూ ఎంత పని చేసింది? నేను ఇంటికి వచ్చి సుమిత్ర నడిగాను— 'రిపోర్టిచ్చింది నువ్వా?' అని—సుమిత్ర కోపంగా అంది: 'అవును. ఏం?' సుమిత్ర చెంప ఛెళ్ళు మనిపించాను. 'ఇడియట్, ఐ హేట్ యూ' అంటూ గదిలో కెళ్ళి తలుపులు వేసుకున్నాను. కాస్సేపటికి ఏదో కాలు తున్న వాసన వేస్తే తలుపులు తెరిచాను. వంట ఇంటి నిండా మంటల నాలుకలు, మధ్య సుమిత్ర! అర్థమయింది నాకు. గబగబా ఓ బ్లాంకెట్ తెచ్చి సుమిత్ర నందులో చుట్టబెట్టాను. అతి కష్టం మీద మంటల నణచ గలిగాను. ఫోన్ చేసి ఆంబులెన్స్ తెప్పించి హాస్పిటల్‌కు తీసుకెళ్ళాను సుమిత్రను. మూడు రోజులు నరకయాతన అనుభవించి శాశ్వతంగా కళ్ళు మూసింది, నవ వధువుగా ఎన్నో కోర్కెలతో బొంబాయి మహానగరం వచ్చాక నా భార్య. నా హృదయం బండబారి పోయింది. ఇంత విషాదం జరిగిపోతుందని అనుకోలేదు నేను. ఆ పరిస్థితిలో నువ్వు వస్తే నీతో అన్నీ చెప్పుకొందామని ఎదురు చూశాను. కానీ, నువ్వు వచ్చి మాత్రం ఏం చేస్తావు? నాలుగు ఓదార్పు మాటలు చెప్పి వెళ్ళి పోతావు. మళ్ళీ నేను ఒంటరిగా, నేను చేసిన తప్పులు దెయ్యాలై నా చుట్టూ నృత్యం చేస్తూ ఉంటే కుమిలిపోవాలి. నా వేదనకు మందు—నేను శాశ్వతంగా ఈ లోకం నుంచి సెలవు తీసుకోవడమే-నీ శేషగిరి.''

★

# వైద్య విజ్ఞానం

## శుక్లాలూ, పొరలూ

"దేవరా, ఇది పొరా? శుక్లమా?" అని అడుగుతాడు అయ్యపరెడ్డి. "బాబూ, శుక్లం ముదిరిందా?" అని ప్రశ్నిస్తాడు ప్రహ్లాదరావు. "అమ్మయ్య తల్లి పోసి పొర ఎక్కొచ్చింది" అన్నాడు అన్నారెడ్డి. "కంప తగిలి శుక్లం మొలి చింది" అని ఎల్లమంద విన్నవించాడు.

నిజానికి 'శుక్లం' అంటే ఏమిటి? 'పొర' అంటే ఏమిటి? కంటిలోని కటకం (లెన్స్) తెల్లబడి చూపుకు అవరోధం కలిగించే స్థితిని కాటరాక్ట్ శుక్లం అంటారు ప్రజలు. వాస్తవానికి ఆయుర్వేద శాస్త్రపరిభాష రీత్యా శుక్లమండలం (కార్నియా) లో ఏర్పడే పువ్వులాంటి మచ్చలను శుక్లాలు అనటం సమంజసమే అయినప్పటికీ, ప్రజా బాహుళ్యంలో ప్రాబల్యంలో ఉన్న పరిభాషను మార్చి సాధించగల ప్రయోజనం శూన్యం కనక కాటరాక్ట్‌నే 'శుక్లం' అని వ్యవహరిస్తే తప్పు లేదు. కాబట్టి ఇక మీద 'శుక్లం' అనే పదాన్ని ఈ అర్థం లోనే గ్రహించాలి. 'పొర' అంటే నల్లగుడ్డు (కార్నియా) మీద ఏర్పడే తెల్లమచ్చలు తెల్లగుడ్డు మీది నుంచి నల్లగుడ్డు మీదికి వ్యాపించే తెల్ల పొరలూ (టెరిజియం) అని అర్థం చేసుకోవాలి.

### శుక్లాలు

శుక్లాలు సాధారణంగా వయసు మళ్ళిన వారిలో రావటం సహజం (సినైల్ కాటరాక్ట్). వార్ధక్యంలో కాక బాల్యంలోనూ (కంజెనిటల్ కాటరాక్ట్), యౌవనంలోనూ (జువె నైల్ కాటరాక్ట్) కూడా రావటం కద్దు. కంటికి దెబ్బ తగలటం వల్ల గాయజనిత శుక్లాలు (ట్రామాటిక్ కాటరాక్ట్) ఏర్పడతాయి. కొన్ని కీళ్ళ జబ్బుల వల్లా, మధుమేహం లాంటి శరీరవ్యాధుల వల్లాకూడా ప్రత్యేక రక మైన శుక్లాలు (కాంప్లికేటెడ్ కాటరాక్ట్) సంభవించవచ్చు. ఇలాగ ఇతర వ్యాధుల వల్ల వచ్చే శుక్లాలు మామూలు వార్ధక్యపు శుక్లాలకంటే త్వరగా ముదురుతాయి.

వృద్ధాప్యంలో వచ్చే శుక్లాలు పక్వం అయ్యే ప్రక్రియలో నాలుగు దశలున్నాయి. ఈ దశలన్నీ పూర్తి అయి శుక్లం ముదరటానికి కొందరికి రెండు, మూడేళ్ళు పట్టవచ్చు. శరీర తత్వాన్ని బట్టీ, ఇతర కారణాలను బట్టీ మరి కొందరికి అయిదా రేళ్ళ, పదేళ్ళ పట్టవచ్చు.

### లక్షణాలు

మామూలుగా కంట్లో ఉండే మాంస కటకం (క్రిస్టలైన్ లెన్స్) నిర్మలంగా ఉండి, కాంతి కిరణాల ప్రసారాన్ని నిరాటం కంగా జరుపుతుంది. వీరిలో కంటిపాప నల్లగా ఉంటుంది. వయసు మళ్ళే కొద్దీ కటకంలో మార్పులు ఏర్పడతాయి. కటకంలో అంచుల దగ్గర నుంచీ పైకిలు